నిమ్మ రైతుకు ధరాఘాతం

- భారీగా పడిపోయిన ధర
- ప్రభుత్వ ప్రోత్సాహం కోసం ఎదురుచూపులు


దెందులూరు: ఆరుగాలం శ్రమించి లక్షలాది రూపాయలు పంటలపై పెట్టుబడి పెట్టి రైతులు నిమ్మ సాగు చేస్తున్నారు. అయితే ఎగుమతి సమస్యలతో పంటకు వ్యాధులు రావడం వల్ల నిమ్మ ధర అమాంతంగా తగ్గింది. ఏం చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో అయినా కాడికి తక్కువ రేటుకి అమ్ముకుంటున్నారు. దెందులూరు నియోజకవర్గంలో పెదవేగి, పెదపాడు, దెందులూరు మండలాల్లో దాదాపు 8 వేల ఎకరాల్లో 3 వేల మంది రైతులు నిమ్మ సాగు చేస్తున్నారు. నిమ్మ పంటను ఢిల్లీ, బీహార్, కలకత్తా, ఒరిస్సా వంటి ప్రాంతాలకు కమీషన్ దారుల ద్వారా ఎగుమతి చేస్తున్నారు. నిమ్మ సాగు చేయడానికి ఒక ఎకరానికి రూ.1.50 లక్షలు కూలీ, నీరు రవాణా కోత మందులకు గానూ ఖర్చవుతుంది. అన్ని సక్రమంగా ఉంటే ఒక ఎకరానికి 50 నుంచి 100 బస్తాలు దిగుబడి వస్తుంది.

ఎండాకు తెగులుతో..

ప్రస్తుతం నిమ్మ రైతులు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఎకరానికి కేవలం 20 నుంచి 30 బస్తాలు మాత్రమే దిగుబడి వస్తుంది. ఎండుకొమ్మ తెగులు వల్ల ఒక కేజీ నిమ్మకాయలు రూ.70 నుంచి 100కు అమ్మిన రైతులు నేడు రూ. 4 నుండి 9 లోపే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఇక ఏం చేయాలో తెలియక 20 కాయలు 30 కాయలు క్యారీ బ్యాగులో పెట్టి విడిగా అమ్మడానికి కూడా వెనుకాడడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. భాష సమస్య ఉండడం వల్ల నేరుగా పంట పండించిన రైతులు గమ్యస్థానానికి చేరేలా మాట్లాడుకోవడానికి అవకాశం ఉండడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. అందువల్ల ఎంత దిగుబడి వచ్చినా ఎంత పంట పండినా వాతావరణం అనుకూలించినా కమీషన్‌దారులు ఇచ్చిన రేటుకు ఒప్పుకుని నిమ్మ సాగు చేయాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. రెండు నెలలుగా కేజీ ధర రూ. 6 నుంచి 10 లోపే అమ్ముకోవాల్సి రావడంతో నిమ్మ రైతు కళ్లు చెమ్మగిల్లుతున్నాయి.



నిమ్మ చెట్టుకు ఎండుకొమ్మ సోకడంతో ఇలా



ధర లేకపోవడంతో లూజు విక్రయాలకు క్యారీ బ్యాగుల్లో ఉంచిన నిమ్మకాయలు

ధర ఆశాజనకంగా లేదు



రెండు నెలల నుంచి నిమ్మ ధర ఆశాజనకంగా లేదు. కేజీ రూ.10 కి అమ్ముకోవాల్సి వస్తుంది. ఎంత పంట పండినా వాతావరణం ఎంత అనుకూలంగా ఉన్న ధర లేకపోతే సన్న, చిన్నకారు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. నష్టాలను చవి చూడాల్సి వస్తోంది.

– గుర్రం రాంబాబు, నిమ్మ రైతు

జ్యూస్ ఫ్యాక్టరీ పెడితే లాభం



ఏలూరు జిల్లాలో నిమ్మ జ్యూస్ ఫ్యాక్టరీ పెట్టాలి. ఏలూరు జిల్లాలో అధికంగా అతిపెద్ద పంటగా నిమ్మ సాగు జరుగుతుంది. సీజన్ అన్ సీజన్‌లో నిమ్మ రైతులకు శాశ్వత వ్యాపారం అభివృద్ధి ప్రోత్సాహం ఇచ్చేందుకు ప్రభుత్వం జ్యూస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలి. ఇలా చేస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాదిమందికి శాశ్వత ఉపాధి లభిస్తుంది.

– తొత్తడి వేదకుమారి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి

ప్రభుత్వం ఆదుకోవాలి

ఆయిల్‌పామ్ సాగులో ప్రభుత్వం రైతులకు వెసులుబాటు కల్పించినట్టే నిమ్మ సాగు చేసే రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి. ముదురు నిమ్మతోటల పునరుద్ధరణకు మందులు క్లోనింగ్ కత్తెర ఇతర అవసరాల నిమి త్తం సబ్సిడీ అందించాలి. నిమ్మ రైతులకు మంచి ధర ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– మాగంటి బాలాజీ, నిమ్మ రైతు

క్లుప్తంగా

అక్రమ కేసులకు భయపడేది లేదు



కామిరెడ్డి నాని

దెందులూరు: ఇప్పటివరకు తనపై 10 అక్రమ కేసులు పెట్టారు... ఇప్పుడు మరో కేసు పెట్టారని, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా తన పోరాటం ఆగదని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షులు కామిరెడ్డి నాని అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, కొఠారు అబ్బయ్య చౌదరి దెందులూరు ఎమ్మెల్యే అయ్యేంతవరకు నా పోరాటం ఆగదని, అక్రమ కేసులకు భయపడే మనస్తత్వం తనది కాదని తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శిలాఫలకాలు పెట్రోల్ బంకులు, నేమ్ బోర్డులు,సచివాలయాలు రైతు భరోసా కేంద్రాల ప్రారంభోత్సవ బోర్డులు ధ్వంసం చేయడం వేధింపులు అక్రమ కేసులు ఎప్పుడూ చేయలేదన్నారు. తనపై అక్రమ కేసులు పెట్టి మీ సమయం వృథా చేసుకోవద్దని కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుందన్నారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ



పారిశుద్ధ్య పనులను తనిఖీ చేస్తున్న జడ్పీ సీఈఓ శ్రీహరి

దెందులూరు: పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ పనుల్లో అలసత్వం వహించవద్దని జెడ్పీ సీఈవో ఎం.శ్రీహరి అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని సోమవరప్పాడు గ్రామంలో పారిశుద్ధ్యంతో పాటు తాగునీటి సరఫరా పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని మండలాల్లో ప్రతిరోజూ ఈఓపీఆర్‌డీలు, ఎంపీడీవో విధిగా పనులను పర్యవేక్షించాలని సూచించారు. వారానికి ఒక్కసారైనా ఆయా పనులపై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో పంచాయతీ ఉద్యోగులు అలసత్వం ప్రదర్శించకుండా జవాబుదారీతనంతో విధులు నిర్వహించేలా మండల అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. ఆయనవెంట దెందులూరు ఎంపీడీఓ కె.శ్రీదేవి, సోమవరప్పాడు గ్రామ కార్యదర్శి ఆదిలక్ష్మి తదితరులు ఉన్నారు.


భారీ వాహనాలు రాకుండా గడ్డర్ ఏర్పాటు



నారాయణపురంలో గ్రామపంచాయితీ ఏర్పాటు చేసిన గడ్డర్లు

ఉంగుటూరు: మండలంలోని నారాయణపురం ప్రధాన రహదారిపై బ్రిడ్జి కుంగిపోవడంతో భారీ వాహనాలన్నీ చేబ్రోలు పోలీస్ స్టేషన్ వైపు ఉన్న రహదారినుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రహదారిలో కూడా తూమువద్ద కుంగడంతో భారీ వాహనాలు తిరగకుండా శనివారం పంచాయతీ అధికారులు గడ్డరు ఏర్పాటు చేశారు. దీంతో ఐస్ లోడులు, చేపలు లోడు లారీలు కాలువగట్టు మీద నుంచి వెళ్లకుండా అడ్డుకట్ట పడనుంది. భారీ వాహనాలు ఇటువైపు రాకుండా పోలీసులు పర్యవేక్షిస్తున్నారని సర్పంచ్ అలకానంద తెలిపారు.

సచివాలయం ఎదుటే రోడ్డు అధ్వానం



రహదారి మధ్యలో పడిన గుంత

దెందులూరు: దెందులూరు ప్రధాన రహదారిలో సచివాలయం ఎదుట రోడ్డు మధ్య మూడు పెద్ద గుంతలు ప్రయాణికులకు తీవ్ర ఇక్కట్లు గురి చేస్తున్నాయి. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనం ఆ గుంతల్లో పడతాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రాందీ షాపు, సచివాలయం, పెట్రోల్ బంకు, రైతు సేవ కేంద్రం ఎదుటే ఈ మూడు గుంతలు ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రయాణికులు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు సమస్య పరిశీలించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

నేడు కనకదుర్గమ్మకు ఆషాఢ మాస సారె సమర్పణ

దెందులూరు: స్థానిక కనదుర్గమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి రామదండు ఆధ్వర్యంలో ఆషాఢ మాస సారె సమర్పిస్తామని రామదండు దెందులూరు మండల నాయకులు సుగ్గిశెట్టి సూకరాజు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం దెందులూరు విష్ణు ఆలయం నుంచి ఉదయం 7.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 108 మంది స్త్రీలు 108 రకాల కావిడలతో తొలి ఏకాదశి పురస్కరించుకుని గ్రామ శివారులో ఉన్న కనకదుర్గమ్మ వారికి ఆషాఢ మాస సారె సమర్పిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాల్గొనే భక్తులంతా సంప్రదాయ దుస్తులు ధరించాలని ఆయన కోరారు.

నూతన కమిటీలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: నూతనంగా ఏర్పాటైన గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కమిటీలు పార్టీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేయాలని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. పార్టీ ఏలూరు జిల్లా కార్యదర్శిగా నియమితులైన డీబీఆర్‌కే చౌదరి, పార్టీ నాయకులు బళ్ళ విజయకుమార్, పందు లింగాల, రవికిరణ్, మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో అబ్బయ్యచౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఆయన అభినందించారు.

బెల్లం ఊట ధ్వంసం

కుక్కునూరు: సారా తయారీకి సిద్ధం చేసిన బెల్లం ఊటను శనివారం ధ్వంసం చేశామని ఎక్సైజ్ ఎస్సై వెంకటలక్ష్మి తెలిపారు. కుక్కునూరు మండలం జిల్లెలగూడెం అటవీప్రాంతంలో నిర్వహించిన దాడుల్లో గుట్టుచప్పుడు కాకుండా నాటుసారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 300 లీటర్ల పులిసిన బెల్లం ఊట ధ్వంసం చేశామని చెప్పారు. దాడులలో ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

అండర్‌పాస్‌లో నీటితో ఇక్కట్లు



అండర్‌పాస్‌లోకి చేరిన నీరు

దెందులూరు: కోట్లాది రూపాయలతో నిర్మించిన దెందులూరు–అలుగులగూడెం మధ్య అండర్‌పాస్ ప్రయాణికులకు పాదచారులకు నరకాన్ని చూపుతుందని వాపోతున్నారు. సరైన ప్రణాళికతో పాటు రైల్వే ఉన్నతాధికారుల పూర్తిస్థాయి పర్యవేక్షణ లేకపోవడంతో చిన్నపాటి వర్షానికి అండర్‌పాస్‌లో నీరు నిలిచిపోతుంది. అండర్‌పాస్ ఎగువ దిగువ ప్రాంతంలో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో రాత్రివేళల్లో నరకాన్ని చూస్తున్నామని పాదచారులు, ద్విచక్ర వాహనదారులు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు పగలు విద్యార్థులు, రైతులు, పాదచారులు నీటిలో నడవలేక ఇబ్బందులుపడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు సమస్య పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రాజీమార్గం ద్వారా కేసుల సత్వర పరిష్కారం



మెగా లోక్ అదాలత్‌లో కక్షిదారుల కేసులను పరిష్కరిస్తున్న జడ్జి ఎస్.ప్రియదర్శిని నూతక్కి

భీమడోలు: కక్షిదారుల కేసుల సత్వర పరిష్కారం లోక్ అదాలత్ వల్ల సాధ్యమని భీమడోలు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ప్రియదర్శిని నూతక్కి అన్నారు. భీమడోలు కోర్టు ఆవరణలో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. జడ్జి ఎస్.ప్రియదర్శిని నూతక్కి భీమడోలు కోర్టు పరిధిలోని భీమడోలు, ద్వారకా తిరుమల, దెందులూరు మండలాల పరిధిలోని 85 కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించారు. వాటిలో 70 క్రిమినల్ కేసులు, 15 సివిల్ కేసులకు సంబంధించి రూ.10 లక్షల రికవరీ చేశారు. తొలుత జడ్జి ఎస్.ప్రియదర్శిని నూతక్కి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఇరు వర్గాలు రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం ద్వారా సమన్యాయం జరుగుతుందన్నారు. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో భీమడోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.గీతాంజలి, ఉపాధ్యక్షుడు కరణం వాసు, ప్రధాన కార్యదర్శి ఎస్.గోపి, అద్వకేట్లు రాణి, గంగరాజు, రాజారావు, జక్కుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అధ్వానంగా కాలనీ రోడ్డు



గుండుగొలను కొత్త ఎస్సీ కాలనీలో ఓ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

భీమడోలు: వర్షాలకు పలు కాలనీలోని రోడ్లు అధ్వానంగా మారాయి. వర్షపు నీరు రోడ్డుపై నిలిచి నడవడానికి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆ రోడ్డులో నడవలేక ఇతర మార్గాల ద్వారా కాలనీ వాసులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. గుండుగొలనులోని కొత్త ఎస్సీ కాలనీలో పల్లపు ప్రాంతంలో ఉన్న రోడ్డు మరింత అధ్వానంగా మారడంతో కాలనీ వాసులు నానా అవస్థలు పడుతున్నారు. గతంలో గ్రావెల్ రోడ్డు వేసిన గ్రామ పంచాయతీ అధికారులు సరైన డ్రెయినేజ్ వ్యవస్థ చూపకపోవడంతో చిన్నపాటి వర్షానికి సైతం నీరంతా రోడ్డుపై ప్రవహిస్తుంది. దీంతో ఆ రోడ్డంతా బురదమయంగా మారుతుంది. వర్షపు నీరు నిల్వ ఉండడంతో దోమలు ప్రబలుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. తాము పడుతున్న ఈ ఇబ్బందులను సంబంధిత అధికారులు పరిష్కరించాలని కోరుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్ల సౌకర్యం ఏర్పాటు చేయాలని, లోతట్టుగా ఉన్న రోడ్డులో గ్రావెల్ వేసి సమస్య పరిష్కరించాలని కాలనీ వాసులు వేడుకుంటున్నారు.

నేడు ప్రపంచ జూనోసిస్ డే

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో ఈనెల 6న ప్రపంచ సంక్రమితవ్యాధుల దినోత్సవం సందర్భంగా రేబిస్ వ్యాధి టీకాలు వేయనున్నట్టు పశువైద్యశాల సహాయ సంచాలకులు పీఎస్‌వీశేఖర్ దొర తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో అవగాహన సదస్సు ఉంటుందన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణం, పరిసర గ్రామాల్లోని పెంపుడు కుక్కలు, పశువులకు ఉచితంగా అందించే రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పేర్కొన్నారు.

వైఎస్సార్ విగ్రహం తొలగింపునకు యత్నం

- అడ్డుకున్న ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు



వైఎస్సార్ విగ్రహాన్ని తొలగింపును అడ్డుకుంటున్న పార్టీ నాయకులు, గ్రామస్తులు

దెందులూరు: మండలంలోని మేదినరావుపాలెం గ్రామంలోని రామాలయం పక్కన ఉన్న మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని తొలగించేందుకు శనివారం రోడ్డు కాంట్రాక్టర్ చేసిన ప్రయత్నాన్ని ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీ శ్రేణులు అడ్డుకున్నారు. గ్రామంలో రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. అయితే రోడ్డు డ్రెయిన్ నిర్మాణంలో భాగంగా మూల భాగంలో విగ్రహం అడ్డుగా ఉందనే నెపంతో తొలగించేందుకు యత్నించారు. విషయం తెలిసిన గ్రామ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, గ్రామస్తులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాంట్రాక్టర్ తో చర్చలు జరిపారు. తాత్కాలికంగా వైఎస్సార్ విగ్రహం తొలగింపు ప్రయత్నాన్ని నిలుపుదల చేశారు.

రోడ్డు విస్తరణ పేరుతో ఇళ్ల గోడలు కూల్చివేత



ఆక్రమణలు తొలగించిన దృశ్యం

కామవరపుకోట: స్థానిక వీరభద్ర స్వామి ఆలయానికి వెళ్లే దారిలో రహదారి విస్తరణ పేరుతో శనివారం అధికారులు ఇళ్ల గోడలను కూల్చివేశారు. శుక్రవారం శ్రీ వీరభద్రస్వామి ఆలయ స్థల వివాదం నేపథ్యంలో ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు ఆలయానికి వెళ్లే రహదారికి రెండు వైపులా ఉన్న ఇళ్ల గోడలు, చెట్లు కూడా కూల్చివేశారు. దీనిపై తమకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని బాధితులు వాపోతున్నారు. గోడలు కూల్చివేసే సమయంలో గేట్లు సైతం విరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కొందరు గోడలే కూల్చి, మరి కొందరి గోడల విషయంలో చూసీ చూడనట్టు వదిలేశారని ఆరోపించారు. ఈ ఘటనపై ఈఓ కలగర శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఆలయానికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించామని చెప్పారు. ఆక్రమణల్లో ఉన్న స్థలాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామని, తూరలు తొలగించే ప్రక్రియ మొదలు పెట్టామన్నారు.

మారుమూల గ్రామాలకు లయన్స్ సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ గవర్నర్ ఈపూరి

గణపవరం: సేవా సంస్థల్లో అగ్రగామిగా నిలిచిన లయన్స్‌క్లబ్ సేవలను మారుమూల గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ అన్నారు. శనివారం రాత్రి గణపవరం లయన్స్‌క్లబ్ భవనంలో క్లబ్ అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు అధ్యక్షతన క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలోఈపూరి మాట్లాడుతూ సామాజిక సేవ చేయడం ఒక అదృష్టమని, ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంత భాగాన్ని సామాజిక సేవకు వినియోగించాలని పిలుపు ఇచ్చారు. ముఖ్య అతిథి లయన్స్ మల్టీకౌన్సిల్ చైర్మన్ శ్రీరామ సురేష్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు అమలు చేయడంలో గణపవరం లయన్స్‌క్లబ్ జోన్‌పరిధిలో మంచి గుర్తింపు సాధించిందని అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవీ రోగులకు పౌష్టికాహారం కిట్లు, సైకిళ్లు పంపిణీ చేశారు. గణపవరం, నిడమర్రు మండలాలలో పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 10 మంది విద్యార్థులను సన్మానించి, నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసా పత్రాలను అందచేశారు. వివిధ పాఠశాలలు, వసతి గృహాలకు సీలింగ్ ఫ్యాన్‌లు, ప్లాస్టిక్ కుర్చీలు, విద్యార్థులకు నోటు పుస్తకాలను అందచేశారు. అనంతరం గణపవరం లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా వెల్లంకి నరేష్, ఉపాధ్యక్షుడిగా కాకర్ల వినాయక, కోశాధికారిగా కె.సత్యనారాయణ మూర్తి, కార్యదర్శిగా కిలారి రవిబాబు, ఇతర కార్యవర్గ సభ్యులతో శ్రీరామసురేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు సత్తినీడి నాని, కేఎస్ విశారద, ఎం.హరికిరణ్, కె.రామకృష్ణ, అబ్దుల్ గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలి



పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు టీచర్ల కృషి చేయాలని భీమడోలు ఎంఈఓ–1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. పోలసానిపల్లి నెం.1 ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశానేజ పాఠశాలలోని విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను ఆయన పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలందించారు. విద్యార్థుల నుంచి పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు రాబట్టారు. పాఠశాల నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లు, రికార్డులను ఆయన పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం కె.తులసి నుంచి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు రెగ్యులర్ తరగతి పాఠ్యాంశాలతో పాటు సంసిద్ధత కార్యక్రమాలను క్రమ పద్ధతిలో బోధించాల్సిన టీచర్లపై ఉందన్నారు. విద్యార్థులు డ్రాపవుట్స్ కాకుండా చూడాల్సిన బాధ్యత టీచర్లపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందిస్తారని, ప్రైవేటు పాఠశాలల మోజులో పడొద్దని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాన్నీ వారికి అందుతాయన్నారు. ఈ నెల 10న గురువారం జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం చిన్నారులతో కూర్చుని ఎంఈవో సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.తులసి, టీచర్ పి.మంగతాయారు పాల్గొన్నారు.

వైఎస్సార్ హయాంలోనే అభివృద్ధి

వైఎస్సార్ సీపీ నేత కారుమూరి సునీల్

కొయ్యలగూడెం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి విషయానికి వస్తే వైఎస్సార్ ముందు, అనంతరం అని చరిత్రకారులు, రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారని వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ పేర్కొన్నారు. శనివారం కొయ్యలగూడెంలోని యూనియన్ బ్యాంక్ ఎదుట ఎంపీపీ గంజిమాల రామారావు సౌజన్యంతో ఏర్పాటు చేసిన 12 అడుగుల వైఎస్సార్ విగ్రహాన్ని ఆయన మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజులతో కలిసి ఆవిష్కరించారు. పోలవరం నియోజకవర్గంలోనే అతిపెద్ద వైఎస్సార్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం తన చేతులమీదుగా నిర్వహించడం పూర్వజన్మ సుకృతమని బాలరాజు పేర్కొన్నారు. వైఎస్సార్ పాలనను ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా ఉన్న రాష్ట్రాలు అభివృద్ధిలో పయనిస్తున్నాయని విజయరాజు పేర్కొన్నారు. మహానేత పాలను తిరిగి అందించగలిగింది జగన్‌మోహన్‌రెడ్డి ఒకరేనని, మళ్లీ జగనన్న పాలన కోసం ప్రజలు ఆత్రుతతో ఎదురు చూస్తున్నారని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మంతెన సోమరాజు తెలిపారు. అనంతరం నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చిన 500 మందికి పైగా వైఎస్సార్ సీపీ శ్రేణులతో జంగారెడ్డిగూడెం కొవ్వూరు రోడ్డు, గణేష్ సెంటర్ నుంచి పోలవరం రోడ్డులో భారీ ర్యాలీ నిర్వహించారు. బీవీఆర్ చౌదరి, చిక్కాల దుర్గాప్రసాద్, సాయిల స్వాతి, జెడ్పీటీసీలు దాసరి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాన్ని ప్రజలు గుర్తించాలి

మాజీ మంత్రి వనిత



కూటమి ప్రభుత్వ మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ కరపత్రం విడుదల చేస్తున్న మాజీ మంత్రి వనిత, పార్టీ నేతలు

ద్వారకాతిరుమల: ఎన్నికల సమయంలో చంద్రబాబు అబద్ధపు హామీలిచ్చి ప్రజలను ఘోరంగా వెన్నుపోటు పొడిచారని, ఈ మోసాన్ని ప్రజలు గుర్తించాలని మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత అన్నారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలోని ఆర్‌ఆర్ కల్యాణ మండపంలో వనిత అధ్యక్షతన శనివారం నిర్వహించిన గోపాలపురం నియోజకవర్గ పార్టీ శ్రేణుల విస్తృత స్థాయి సమావేశానికి ద్వారకాతిరుమల మండలం నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, తూర్పుగోదావరి జిల్లా పార్టీ పరిశీలకులు తిప్పల గురుమూర్తి రెడ్డి, ప్రోగ్రామ్ ఇన్‌చార్జి చందన నాగేశ్వరరావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా వారు దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కూటమి ప్రభుత్వ మ్యానిఫెస్టోకి సంబంధించిన క్యూఆర్ కోడ్ కరపత్రం విడుదల చేశారు.

అక్రమ కేసులపైనే దృష్టి

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో వనిత మాట్లాడుతూ చంద్రబాబు ఏడాది పాలన మొత్తం వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టడంతోనే సరిపోయిందన్నారు. చెల్లుబోయిన మాట్లాడుతూ బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఏడాది పాలనలో ఒక్క పథకం కూడా బాబు అమలు చేయలేదని ఆరోపించారు. జక్కంపూడి మాట్లాడుతూ పథకాలు అమలు చేస్తానని చంద్రబాబు చెబుతున్న తేదీలు, పండుగలు మారిపోతున్నాయే తప్ప ఫలితం లేదని ఎద్దేవా చేశారు. ప్రజలను ఇప్పటికీ మభ్యపెడుతూనే కాలం గడుపుతున్నారని ధ్వజమెత్తారు. మోసపూరిత హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తుందనేది ప్రజలే గుర్తించాలని కోరారు. సభలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, పోల్కంపల్లి అనీల్, చెలికాని బుల్లియ్య, చెలికాని ప్రవీణ్, బిరుదుగడ్డ చల్లారావు, ఉప్పల మునేశ్వరరావు, దాసరి రాంబాబు, బిరుదుగడ్డ బజారియ్య, గోపా నాగేశ్వరరావు, మద్దిపాటి చిన్న సోమేశ్వరరావు, బొండాడ వెంకన్నబాబు, గుమ్మడి శ్రీను, ప్రత్తిపాటి యోహాను, నల్లూరి వెంకన్నబాబు, నల్లూరి బాపనయ్య, మల్లిపూడి నాగమణి, మస్తాన్ భాష, చిన్న చిన్ని, దాసరి రాంబాబు, దాసరి రాధాకృష్ణ, మానుకొండ కన్నయ్య, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, చిలుకూరి చంద్రం, బొండాడ సాత్యకిరావు, రుద్ర శివ, పొనమాల ఉమామహేశ్వరరావు, దూలపల్లి ప్రసాద్, అచ్యుత ఏసుబాబు తదితరులున్నారు.